ఊరికి దూరంగా.. శ్మశాన వాటిక పక్కన

గ్రామీణ క్రీడా ప్రాంగణాల నిర్మాణం

- గుట్టలు, చెరువులు, కుంటల్లో బోర్డులు ఏర్పాటు
- నిరుపయోగం.. నిధులు వృథా!
- రూ.లక్షల్లో ప్రభుత్వ ఖజానా కాజేశారు



వెన్నంపల్లి గై చెరువులో ఆరెపల్లి తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం

సైదాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణం నిర్మించాలని అందుకు స్థల సేకరణ చేసి ఆటలకు అనువుగా ప్రాంతాన్ని చదును చేసి గ్రామీణ క్రీడా మైదానాలుగా తీర్చిదిద్దాలని అధికారులకు, పంచాయతీ పాలకులను ఆదేశించింది. తహసీల్దార్ అనుమతితో స్థల సేకరణ చేసి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి. కలెక్టర్ ఒత్తిడితో మండల అధికారులు మొదట మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటుకు కసరత్తు చేశారు. కానీ ఏ ఒక్క గ్రామంలో ఆటలకు అనువుగా స్థలం సేకరించలేదు. ఎక్కడ వీలైతే అక్కడ తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం బోర్డులు పాతారు. బోర్డు ఏర్పాటుకు స్థలం ఉంటే చాలు అది క్రీడాప్రాంగణం అయిపోయింది. ఇలా బోర్డులు పాతారు అలా బిల్లులు కాజేశారు. కొన్ని గ్రామాల్లో పాఠశాల మైదానంలోనే క్రీడా ప్రాంగణం, కొన్ని గ్రామాల్లో చెరువు, కుంటలు, శ్మశాన వాటికల పక్కన క్రీడా మైదానాల బోర్డులు పాతించారు. శ్మశాన వాటిక, రోడ్లకు పక్కన బోర్డులు పాతారు. ఏ ఒక్క క్రీడా ప్రాంగణం కూడా ఉపయోగంలో లేదు. ఆరెపల్లిలో ఊరికి కిలోమీటర్ దూరంలో గై చెరువు శిఖాన్ని మైదానంగా చూపించి క్రీడా ప్రాంగణం బోర్డు పెట్టారు. పక్కనే డంపింగ్‌యార్డు, శ్మశాన వాటిక నిర్మించారు. చెరువు నిండితే క్రీడా ప్రాంగణం మునిగి బోర్డు మాత్రమే కన్పిస్తోంది. జాగీర్‌పల్లిలో గుట్టపై ఏర్పాటు చేస్తే ఓవైపు క్వారీ, మరోవైపు క్రషర్, ఇలా గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఒక్కటి ఉపయోగంలో లేదు. నాటి పంచాయతీ పాలకులు, అధికారులకు క్రీడాప్రాంగణాలు ఆర్థిక వనరుగా మారాయి. రూ.లక్షల్లో బిల్లులు కాజేశారు. ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు, పాలకులు నీరుగార్చారని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ధనం కొల్లగొట్టారు



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు అప్పటి పంచాయతీ పాలకులు, అధికారులకు ఆర్థిక వనరులుగా ఉపయోగపడ్డాయి. బోర్డు పాతి రూ.లక్షల ప్రజా ధనం కొల్లగొట్టారు. ఊరికి దూరంగా శ్మశాన వాటికల పక్కన నిర్మించారు. నిరుపయోగమైన క్రీడా ప్రాంగణాల నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి. ప్రజలకు అనువైన చోట ఏర్పాటు చేయించాలి.

– కూతాటి రాణా ప్రతాప్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి

ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి



ప్రస్తుతం ప్రజలకు ఆరోగ్యాన్నిచ్చే యోగా కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి. అభివృద్ధి చెందిన దేశాలు సైతం భారతీయ యోగా, ధ్యాన మార్గాలను అనుసరిస్తున్నాయి. వాకింగ్, జాగింగ్ తప్పనిసరి చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు రోజూ ఉదయం వ్యాయామాలు చేస్తున్నారు. అలాంటి వారికి సౌకర్యంగా గ్రామానికో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి. – గాదపాక కుమార్‌రాజా, సామాజిక కార్యకర్త, సైదాపూర్


గంగాధర: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో నిర్మించిన శ్మశానవాటికకు దారి లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించే క్రమంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని, దారి లేక నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉందని ఇకనైనా స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాము, ఎంపీడీవో, గంగాధర, సెల్ నంబర్: 92814 82645

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమేశ్

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్(తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డా.రమేశ్ కోరారు. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగాద మాట్లాడుతూ.. ఉద్యోగ పోటీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ శిక్షణ తరగతులు ఉపయోగపడుతాయని, రెండు రోజుల శిక్షణ అనంతరం అసెస్‌మెంట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఓదెల్‌కుమార్, టాస్క్ మెంటర్ రాజేశ్, కోఆర్డినేటర్ ఉమాకిరణ్, అధ్యాపకులు రాజేంద్రం, గణేశ్, శ్యామల, కిరణ్‌కుమార్, మాధవి, రవీందర్, సుష్మ, రవిప్రకాశ్, సాయి, మమత, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, రమేశ్, శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ మారథాన్‌లో విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

తిమ్మాపూర్: హైదారాబాద్‌లో నిర్వహించిన కోడ్ ఉన్నతి ఇన్నోవేషన్ మారథాన్ చివరి రౌండ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది ప్రతిభావంతులైన బృందాలు పాల్గొన్నాయి. తెలంగాణలోని ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం రాష్ట్ర స్థాయిలో శాప్ ల్యాబ్ ఇండియా సంస్థ ఎడ్యునెట్ ఫౌండేషన్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సహకారంతో పోటీలు నిర్వహించారు. టాప్ పర్ఫార్మర్స్‌లో జ్యోతిష్మతి కళాశాల సీఎస్ఈ ఫైనలియర్ విద్యార్థులు శానగొండ అజిత్, ల్యాగల మహేందర్ ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారు. వారి ప్రాజెక్ట్, 'ఏ ఐ క్రాప్ కేర్' పోటీలో టాప్ 10 ఇన్నోవేటివ్ ప్రాజెక్టులో గుర్తింపు పొందిందని ప్రిన్సిపాల్ తెలిపారు 'ఏ ఐ క్రాప్ కేర్' ప్రాజెక్ట్ రైతులు వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి సహాయపడటానికి రూపొందించబడిన ఏఐ ఆధారిత పరిష్కారమన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సుమిత్ సాయి, ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, డీన్ అకడెమిక్ అండ్ ఆడిట్ వైశాలి, విభాగాధిపతి డా జగదీషన్ విద్యార్థులను అభినందించారు.

ఫీజు చెల్లించలేదని స్కూల్ నుంచి గెంటివేత

శంకరపట్నం: ఓ ప్రైవేట్ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థినిని ఫీజు చెల్లించలేదని కరస్పాండెంట్ స్కూల్ నుంచి గెంటేసిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన మోరె లక్ష్మీఆరాధ్య కేశవపట్నంలోని ఓప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. రూ.పదివేల ఫీజు బకాయి ఉందని గంటపాటు క్లాస్‌రూం బయట నెలబెట్టి, క్లాస్‌లో కూర్చున్న లక్ష్మీఆరాధ్యను కరస్పాండెంట్ ఫీజు చెల్లించాకే లోపలికి రావాలంటూ గెంటేయడంతో కిందపడిపోయినట్లు విద్యార్థిని తండ్రి సుదర్శన్‌తో కలిసి బోరున విలపించింది. ఫీజు విషయం తల్లిదండ్రులకు చెప్పాలని, చిన్నారిని నెట్టేసిన కరస్పాండెంట్‌పై డీఈవో చర్యలు తీసుకోవాలని విద్యార్థిని తండ్రి సుదర్శన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్‌ను వివరణ కోరగా విద్యార్థిని రూ.40 వేల వరకు బకాయి ఉందని, ఫీజు చెల్లించాలని అడిగానని బయట నిలబెట్టలేదని, గెంటివేయలేదన్నారు.

రైతులతోనే సహకార సంఘాలు అభివృద్ధి

సైదాపూర్: రైతుల సహకారంతోనే వ్యవసాయ సహకార సంఘాలు అభివృద్ధి చెందుతున్నాయని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బిల్లా వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెన్కెపల్లి, వెన్నంపల్లి సహకార సంఘాల వార్షిక మహాసభ ఆయా సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జరిగింది. వెన్నంపల్లి సహకారం సంఘం ఆధ్వర్యంలో రైతుల సౌకర్యం కోసం గోదాం, పెట్రోల్ బంక్, నూతన కార్యాలయ భవనం నిర్మించామని చైర్మన్ వెంకటరెడ్డి అన్నారు. సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

నాయకుల హర్షం

హుజూరాబాద్: బడ్జెట్‌లో బ్రాహ్మణుల అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయించడం, విదేశీ విద్య పథకంకు చెల్లించాల్సిన రూ.30 కోట్లు బ్రాహ్మణ పరిషత్‌కు జమ చేయడం పట్ల కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ విష్ణుదాస్, గోపాల్‌రావు హర్షం వ్యక్తం చేశారు. విలేకర్ల సమావేశంలో బుధవారం ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్

వీణవంక: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. 18 సంవత్సరాల లోపు బాలబాలికల హక్కులు, సంరక్షణ కోసం బాలల న్యాయచట్టం 2015 ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సమగ్ర బాలల పరిరక్షణ పథకాన్ని ప్రారంభించాయని, మత్తుపదార్థాలకు బాలలు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, శ్యామల, పీహెచ్‌సీ వైద్యులు వరుణ, కేజీబీవీ ప్రిన్సిపల్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గన్నేరువరం: బాలల పరిరక్షణ అందరు బాధ్యతగా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి, తహసీల్దార్ నరేందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ పావరణలో బుధవారం బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, డ్రాఫవుట్, బాల కార్మికులు, దత్తత పిల్లల రక్షణ, సంరక్షణ మొదలగు వాటిపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామయ్య, ఎస్‌హెచ్‌వో నరేశ్, వైద్యులు ప్రణవ్, ఏఎల్‌వో చక్రధర్‌రెడ్డి, ఏపీఎం లావణ్య, సూపర్‌వైజర్ కవిత, డీసీపీయూ సిబ్బంది శాంత, రమేశ్, సాయికిరణ్, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, సరోజన, పుష్పలత పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపించాలి

సైదాపూర్: బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తహసీల్దార్ మంజుల అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాలల సంరక్షణ కమిటీ అవగాహన సమావేశం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రావుల రాజశ్రీ అధ్యక్షతన జరిగింది. బడీడు పిల్లలను బడికి పంపించాలని, బాలకార్మికులను గుర్తించి బడిలో చేర్పించాలని తహసీల్దార్ మంజుల కమిటీ సభ్యులకు సూచించారు. అనాథ పిల్లలకు రక్షణ కల్పించాలన్నారు. చదువు రాని తల్లిదండ్రులకు చదువుకుంటే పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో వివరించాలని, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో బసీరొద్దీన్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్‌లు, వీవోఏలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి కాకతీయ కాలువ వద్ద కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు, లారీ బుధవారం రాత్రి ఢీకొన్నాయి. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్ నుంచి ప్రయాణికులతో కరీంనగర్ వైపు వెళ్తుండగా, కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ ఆర్టీసీ బస్సును పక్కనుంచి ఢీకొంది. ఘటనలో బస్సులోని ప్రయానికులు, డ్రైవర్‌కు గాయాలు కాలేదు. కాలువ వద్ద బస్సు లారీ ఢీ కొనడంతో తృటిలో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఘటనతో రహదారికి ఇరువైపుల వాహనాలు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి ట్రాఫిక్ జామ్ అయింది. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లీయర్ చేశారు.

ఇఫ్తార్ విందు



తిమ్మాపూర్: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, తిమ్మాపూర్ ఎమ్మార్వో విజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ... రంజాన్ ముస్లింలకు పవిత్ర మాసమని నెల రోజులు చేసే కఠిన ఉపవాస దీక్ష అందరిలో సహనం, పేదల ఆకలిబాధను తెలియజేస్తాయని అన్నారు. ఈ మాసంలో పేదలకు దానం చేయాలని కోరారు. కఠోర ఉపవాసం ముస్లింలలో సహనానికి నిదర్శనమని, పండుగను అందరు ఐక్యంగా జరుపుకోవాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్, ఆర్ఐలు షరీఫ్, అశోక్, సమద్, తాజుద్దీన్, రజాక్, యూసఫ్, సర్వర్, యూనుస్, ఫరూక్ తితరులు పాల్గొన్నారు.

సన్మానం

హుజూరాబాద్: జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారానికి ఎంత దూరమైన వెళ్తామని హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాయిత రాములు, కామని రవీందర్ అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లోని సాయిరూప గార్డెన్‌లో ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశంలోమాట్లాడారు. 20సంవత్సరాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ఇళ్ల పట్టాలు పొందామని, వాటిలో నిర్మాణం కూడా పూర్తి చేశామన్నారు. కాంగ్రెస్ నాయకుడు కావాలని కక్షపూరితంగా నివేశన స్థలాలపై కేసు వేశారన్నారు. పలుమార్లు కాంగ్రెస్ నాయకులను కలిశామని, చివరిగా సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు. సమస్యను పరిష్కరించే వరకు పోరాడుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌ను మరోమారుకలుస్తామని, సానుకులంగా స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం ప్రెస్ క్లబ్ కమిటీని కళారవళి అసోషియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

గొర్రెల సంతకు వేలం

చొప్పదండి: మున్సిపాలిటీలో ప్రతి శనివారం నిర్వహించే గొర్రెలు, మేకల వారసంతకు బుధవారం మున్సిపల్ కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. నూనె చంద్రయ్య రూ.12.65 లక్షలకు వేలం దక్కించుకున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఏడాది పాటు వేలం వర్తిస్తుందని అధికారులు తెలిపారు. కూరగాయల వారసంత రూ.2.42 లక్షలకు చెట్‌పల్లి శ్రీనివాస్ వేలం దక్కించుకున్నారు.

గన్నేరువరంలో...

గన్నేరువరం: గన్నేరువరం గ్రామ పంచాయతీ పరిధిలోని 17 దుకాణా సముదాయాలు, వారసంతకు సంవత్సర కాలానికి బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో మండల పరిషత్ అధికారులు వేలం నిర్వహించారు. వారసంత రూ.1,58,500కు నల్లగోని మల్లయ్య దక్కించుకున్నారు. ఒకటో నంబర్ దుకాణా సముదాయానికి రూ. 8200, అతి తక్కువ 15వ నంబర్ దుకాణా సముదాయాన్ని రూ. 5000 పలువరురు దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

నియామకం


మహేందర్‌కు కండువా కప్పుతున్న నాయకులు

జమ్మికుంట: బీఎస్పీ జమ్మికుంట మండల అధ్యక్షుడిగా మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన దాసారపు మహేందర్‌ను బీఎస్పీ జోనల్ కోఆర్డినేటర్ మారపల్లి మొగిలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె ప్రశాంత్‌గౌడ్ నియమించారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకొని నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేశ్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు పెరుక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మంతెన సంపత్, కార్యదర్శి రేణిగుంట్ల రంజిత్, కోశాధికారి రాచపల్లి రమేష్, నాయకులు గిన్నారపు మహేందర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి కమిటీ అధ్యక్షుడిగా..



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని బీఎస్ఆర్ గార్డెన్‌లో అంబేడ్కర్ జయంతి కమిటీ ఎన్నిక సమావేశం మాజీ చైర్మన్ మహ్మద్ ఖాలిక్ హుస్సేన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. జయంతి కమిటీ అధ్యక్షుడిగా మారెపల్లి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. పరిశీలకులుగా అలేటి రవీందర్, రుద్రరపు రామచంద్రం, బోరగాల సారయ్య, డాక్టర్ తడికమళ్ళ శేఖర్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు సొల్లు బాబు, కొండ్ర నరేస్, కొలిపాక శంకర్, చందుపట్ల జనార్దన్, వేల్పుల రత్నం, ఎర్ర రమేష్, సమ్మయ్య, వసంత్, శ్రీధర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద యూత్ క్లబ్ ఎన్నిక

చొప్పదండి: పట్టణంలోని వివేకానంద యూత్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కస్తూరి వెంకటేశం బుధవారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఐట్ల మల్లేశం, కోశాధికారిగా సిరిపురం తిరుపతి, స్టీరింగ్ కమిటీ సభ్యులుగా వొడ్నాల తిరుపతి, తాటిపెల్లి అంజయ్య, తెలుకుంట సత్యనారాయణ, గోవులకొండ ఆంజనేయులు, దూస రాము, గోవులకొండ ప్రదీప్ నియామకమయ్యారు.

వాటర్ ప్యూరిఫైయర్ అందజేత



జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రభాత్ అగ్రీ బయోటెక్ లిమిటెడ్ కంపెనీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ రమేష్, మార్కెటింగ్ ఆఫీసర్ రఘుపతి ఆధ్వర్యంలో రూ.25వేల విలువ చేసే వాటర్ ప్యూరిఫైయర్‌ని బుధవారం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని వాటర్ ప్యూరిఫయర్ అందజేశామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నేరేళ్ల సదానందం, పేరవేన రాజమౌళి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గన్నేరువరం: మాదాపూర్‌లో పోచమ్మ బోనాలు


మానకొండూర్: ఆలయం ఆవరణలో పెద్దపట్నం

ఘనంగా పోచమ్మ బోనాలు

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ లో శ్రీరాజరాజేశ్వర మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని గ్రామ వీధుల గుండా పోచమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడ్లు బాలయ్య, సుంకరి రమేష్, మాధరి మొండయ్య, శ్రీనివాస్, స్వామి, అనిల్, కొమురయ్య, పేరోజీ లక్ష్మన్, భూపెల్లి బాలయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, మానకొండూర్ తదితర గ్రామాలలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. పోచమ్మతల్లికి ప్రత్యేకంగా నైవేద్యం సమర్పించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకొని పిల్లాపాపలు, పాడి పంటలు బాగుండాలని మొక్కుకున్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో పెద్దపట్నం

మండలంలోని గంగిపల్లి ఏదుగుట్ట మల్లికార్జునస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పెద్దపట్నం వేశారు. బోనాలు, పట్నం, ఒగ్గుపూజారులతో మల్లన్న చరిత్ర, ముడుపులు, ఆంజనేయ స్వాములకు భిక్ష, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. యాదవ సంఘం అధ్యక్షుడు పర్శరాములు, కార్యదర్శి ఐలయ్య, రాజ్‌కుమార్, సమ్మయ్య, ఆలయ ధర్మకర్త సంపత్‌రెడ్డిచ జెట్టి కొమురెల్లి,పోషాలు, లక్ష్మయ్య, రాములు భక్తులు పాల్గొన్నారు.

చల్లంగా చూడు పోచమ్మ తల్లి

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు, చింతలపల్లి గ్రామాల్లో బుధవారం పోచమ్మ బోనాలు జాతర నిర్వహించారు, చల్లంగా చూడు పోచమ్మ తల్లి అంటూ బోనాలు, నైవేద్యాలు సమర్పించారు.

నిలిచిన ఇసుక క్వారీ ఆందోళనలో లారీ డ్రైవర్లు



వీణవంక: మండలంలోని కొండపాక గ్రామ శివారులోని మానేరు వాగు వద్ద ఏర్పాటు చేసిన ఇసుక క్వారీ ఐదురోజులుగా నిలిచిపోయింది. నిర్వాహకులు క్వారీ మూసివేయడంతో ఇసుక కోసం స్లాట్ బుక్ చేసుకున్న లారీ డ్రైవర్లు క్వారీ వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఐదు రోజులుగా ఇబ్బందులు పడుతున్నామని సుమారు 50 లారీల డ్రైవర్లు వాపోతున్నారు. డీడీలు వేరే క్వారీకి మార్చాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు.

చెత్తాచెదారం తొలగించండి

జమ్మికుంట: పట్టణంలోని మిల్లురోడ్డు, మడిపల్లి రైల్వే గేట్ వైపు వెళ్లే రోడ్డు పక్కన ప్రహరీ వద్ద చెత్త, ప్లాస్టిక్, కుళ్లిన ఆహార పదార్థలు వేయడంతో దుర్వాసన వెలువడుతోందని బీజేపీ మండల నాయకుడు వొల్లాల సాంబయ్య బుధవారం అన్నారు. మిల్లుల్లో పని చేసే హమాలీలు అనారోగ్యానికి గురవుతున్నారని, మున్సిపల్ పాలకవర్గం స్పందించి చెత్తాచెదారం తొలిగించాలని డిమాండ్ చేశారు.

నేడు అగ్నిగుండాలు

చొప్పదండి: మడలంలోని గట్టు మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం ఉగాది అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు నాగవెల్లిపట్నం, శ్రీభమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం, ప్రత్యేక అగ్నిగుండాలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

తాడికల్ విండో సమావేశం


సమావేశంలో పాల్గొన్న పాలకవర్గం

శంకరపట్నం: తాడికల్ సహకార సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం చైర్మన్ కేతిరి మధుకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సంఘం నివేదికను సీఈవో వీరస్వామి చదివి వినిపించారు. సంఘంలో రైతులకు పంట రుణాలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని చైర్మన్ పేర్కొన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్, సభ్యులు రమణారెడ్డి, సత్యనారాయణరావు, సమ్మయ్య, ప్రవీణ్, శేషాచారి, విండో ఉద్యోగి వేణు పాల్గొన్నారు.

29న వారసంత వేలం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం వారసంతకు 29 గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నామని ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31వరకు వారసంత నిర్వహణకు వేలంలో పాల్గొనే వారు రూ.10వేల డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

అదృశ్యం కేసు నమోదు

జమ్మికుంట: ఓ యువతి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి బుధవారం తెలిపారు. మున్సిపల్ పరిధి మోత్కుల గూడెం గ్రామానికి చెందిన యువతి తండ్రితో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి అన్న అజయ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

డంపింగ్‌యార్డు పరిశీలన

హుజూరాబాద్: పట్టణంలోని ఇప్పలనర్సింగపూర్ వద్ద డంపిగ్‌యార్డును కమిషనర్ సమ్మయ్య, కంపోస్ట్ డెవలప్‌మెంట్ అధికారి హేమలత బుధవారం పరిశీలించారు. తడి, పొడిచెత్త వేరు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.